క్లుప్తంగా

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అకాల వర్షాలతో నష్టాలపాలైన రైతులు అధైర్యపడొద్దన్నారు. గ్రామాల్లో పంట నష్టం వివరాలు సేకరించి, నష్టపోయిన రైతులకు ఎకరానికి ఎకరానికి రూ.10 వేలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు, సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్‌రావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తీగల శ్రీనివాస్, కేవీ ప్రోగ్రాం అధికారి రజిని, వైద్యాధికారులు వేణు మాధవ్, భూపాల్ పాల్గొన్నారు.

బహుజన ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు.

చందుర్తి: బీఎస్పీలో ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బహుజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి దర్శనం గంగాధర్ కోరారు. చందుర్తి మండల కేంద్రంలో బహుజన ఆత్మగౌరవ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను పార్టీ మండల అధ్యక్షులు కొరుట్ల రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. బహుజనులందరూ ఏకమై రాజ్యాధికారిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఇన్‌చార్జి బొడ్డు మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి ముదిగంపల్లి రాములు, కోశాధికారి బాబు, కుమ్మరి చిరంజీవి, దుమ్ము హన్మయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు సకల వసతులు ఏర్పాటు చేసి నాణ్యమైన బోధన చేపట్టాలని ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి మోహన్‌రెడ్డికి భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ వినతిప్రతాన్ని అందించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, నూతన సెలబస్‌తో కూడిన పుస్తకాలను అందించాలని కోరారు.

అటకెక్కిన సుందరీకరణ

- పెద్ద చెరువుపై పట్టింపేది?
- నిధులు వెచ్చించినా ఫలితం శూన్యం
- పచ్చదనం, కుర్చీలు మాయం
- వృథా అవుతున్న నీరు

ముస్తాబాద్: ముస్తాబాద్ పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ అటకెక్కింది. దీని కోసం మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నా, నీటిపారుదల, టూరిజం శాఖలు సంయుక్తంగా చేసిన పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ముస్తాబాద్ పట్టణాన్ని అనుకుని ఉన్న పెద్ద చెరువు సంవత్సరం పొడవున, గోదావరి జలాలతో కళకళలాడుతుంది. మంత్రి కేటీఆర్ మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయించారు.

చిల్డ్రన్స్ పార్కు ఎక్కడ?

ఈ చెరువు 2016లో భారీ వరదలకు గండిపడింది. 20 ఏళ్లకు భారీ వర్షాలకు నిండిన పెద్ద చెరువు. 24 గంటల్లోనే గండిపడి నీరంతా ఖాళీ అయ్యింది. దీంతో ముస్తాబాద్ రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వీటి మరమ్మతుకు రూ.5 కోట్లు మంజూరు చేయించి, పనులు పూర్తి చేయించారు. ఆ పనులు పరిశీలించిన మంత్రి పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే ట్యాంక్‌బండ్ కింద పిల్లల పార్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు కూడా ఆరేళ్ల క్రితమే భూసేకరణ చేపట్టారు. ట్యాంక్‌బండ్ మరమ్మతు పూర్తయి రెయిలింగ్, వ్యూపాయింట్ పార్కింగ్ టైల్స్, కుర్చీలు, బెంచీలులతో పాటు ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. కట్టకు ముందు భాగంలో గ్రీనరీ చేశారు. కాని అది మున్నాళ్ల ముచ్చటే అయ్యింది. బెంచీలు, కుర్చీలు దొంగలు ఎత్తుకెళ్లారు. ఇక చిల్డ్రన్స్ పార్క్ ఊసే లేకుండా పోయింది.



వ్యూపాయింట్‌లో మాయమైన కుర్చీలు, బెంచీలు



గ్రీనరీకి నోచుకోని పెద్ద చెరువు కట్ట



నీటితో కళకళలాడుతున్న పెద్ద చెరువు

నిరంతరం పారుతున్న నీరు

పెద్ద చెరువులోకి మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఏటా తరలిస్తున్నారు. దీంతో సంవత్సరం పొడవునా నీరు ఉంటుంది. మండు వేసవిలో సైతం మత్తడి పోస్తుంది. అయితే యాసంగి పంటలకు ముస్తాబాద్, పోతుగల్, తెర్లు మద్ది రైతులకు పెద్ద చెరువు దిక్కయ్యింది. వందలాది ఎకరాలకు సాగునీరు అందించింది. తూమును గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా తెరవడంతో అది మరమ్మతుకు గురయ్యింది. ప్రస్తుతం పంటలకు నీరు అవసరం లేకున్నా నిరంతరం చెరువు నుంచి నీరు కిందికి వెళ్తోంది. ట్యాంక్‌బండ్‌పై బీటీ వేసి, అందమైన వీధి దీపాలు, స్టీల్ రెయిలింగ్, ల్యాండ్‌స్కేప్, పూల మొక్కలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి చేయాలి



పెద్ద చెరువు పక్షులు, జీవరాశులకు అనువుగా వుంది. అందమైన చెరువుకు రెండు వైపులా ఆలయాలు ఉన్నాయి. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌లా దీనిని అభివృద్ధి చేయాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా పూల మొక్కలు, లైట్లు ఏర్పాటు చేయాలి.

– మల్లారపు సంతోష్‌రెడ్డి, ముస్తాబాద్

ప్రణాళిక మేరకు పనులు చేపట్టాలి



ముస్తాబాద్ పెద్ద చెరువు మానేరు ప్రాజెక్టు తరువాత అతి పెద్దది. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి. కలుషితం కాకుండా చూడాలి. పూల మొక్కలు, వీధి దీపాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలి. ప్రణాళికబద్ధంగా సందర్శకులకు అనువుగా పనులు చేయాలి.

– వొరగంటి తిరుపతి, మాజీ సర్పంచ్

ప్రతిపాదనలు పంపించాం



మినీ ట్యాంక్‌బండ్‌కు గతంలో మంజూరైన నిధులను ఖర్చు చేశాం. టూరిజం శాఖ, పంచాయతీ మద్దతుతో పనులు చేపడుతాం. పిల్లల పార్క్‌కు ప్రతిపాదనలు చేశాం. నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకుంటాం. నిరంతర పర్యవేక్షణ గ్రామ పంచాయతీ తీసుకోవాలి. మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం.

– వంశీకృష్ణ, ఏఈ

సమాచారం

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల గిరిజన గురుకులం బాలికల పాఠశాలలో 6వ తరగతిలో పూర్తిగా, 7 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలకు అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రీజనల్ కో–ఆర్డినేటర్ వెంకన్న, పాఠశాల ప్రిన్సిపాల్ రామరావు ఒక ప్రకటనలో కోరారు. దరాఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు సమర్పించిన విద్యార్థులు హాల్ టికెట్లను సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోని కేటాయించిన పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని కోరారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణం

కోనరావుపేట: మండలంలోని నాగారంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, సీతారాముల కల్యాణం వేడుకలు జరుగనున్నాయి. మంగళవారం ప్రతిష్ఠ మూర్తులకు జలాధివాసం, పుష్పాధివాసం నిర్వహించారు. బుధవారం విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలకు, సీతారాముల కల్యాణోత్సవాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఆయన కుమారుడు వికాస్‌రావు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నియామకం

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా గంగాధర్

రుద్రంగి: గౌడ సంఘం రుద్రంగి మండల అధ్యక్షుడిగా పల్లి గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



తంగళ్లపల్లిలో వంటావార్పు చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు



కోనరావుపేటలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్యదర్శులు



చందుర్తిలో సమ్మెకు సంఘీభావాన్ని తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



బోయినపల్లి: జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు పలుకుతున్న బీజేపీ నాయకులు

సమ్మెలో వంటావార్పు

జిల్లాలో జేపీఎస్, ఓపీఎస్ నిరవధిక సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరింది. తంగళ్లపల్లి, కోనరావుపేటలో జేపీఎస్, ఓపీఎస్‌లు వంటావార్పు చేసి తమ నిరసన తెలియజేశారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఇప్పటికైనా స్పందించి రెగ్యులరైజ్ చేయాలని జేపీఎస్‌లు జనార్దన్, మమత రెడ్డి, వాణి కోరారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండల కేంద్రాల్లో సమ్మె చేస్తున్న కార్యదర్శుల శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. వీర్నపల్లి, బోయినపల్లిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండటి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు గునుకుల దేవేందర్‌రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డితో పాటు నాయకులు నిరవధిక సమ్మెలో పాల్గొని మద్దతు ప్రకటించారు. బీసీ విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇన్‌చార్జి ఇల్లందుల ప్రకాశ్‌తో కలిసి జేపీఎస్ దీక్షా శిబిరాన్ని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. చందుర్తిలో సమ్మెకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు పంచాయతీ కార్మికుల జిల్లా నాయకులు మల్యాల నర్సయ్య తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

సిద్దోగం వేడుకలు

కోనరావుపేట: గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్దోగం వేడుకల్లో భాగంగా మండలంలోని మల్కపేటలో రేణుకాదేవి–జమదగ్ని కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ బోనాలు తీశారు. చల్మెడ ఆస్పత్రి చైర్మన్ లక్ష్మీనర్సింహరావు, ఎంపీపీ చంద్రయ్య, కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్ జవ్వాజి దేవయ్య, సర్పంచ్ లత, ఉపసర్పంచ్ అంజయ్య హాజరయ్యారు.

చందుర్తి: మండలం మూడపల్లి గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ చిలుక అంజిబాబు, జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మల్కపేటలో బోనాలు తీస్తున్న మహిళలు

నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 4 జరిగే శ్రీ భూనీలా సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం పూజలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వాసుదేవ పుణ్యాహం, రక్షాబంధనం, రుత్విక్‌వరణం, అఖండ దీపారాధన, కులదేవతా ప్రతిష్ఠ, అంకుర్పాణం, తీర్థప్రసాద వినియోగం, హోమం, పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామాచారి, విజయనరసింహచారి, సుదర్శనచారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మొక్కల పెంపకానికి స్థల పరిశీలన

బోయినపల్లి: మండలంలోని మాన్వాడ, కొత్తపేట, కొదురుపాక గ్రామాల మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట పరిసరాల్లో హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు.

మార్కెట్ యార్డును సందర్శించిన మార్కెటింగ్ శాఖ డీఈఈ

బోయినపల్లి: స్థానిక మార్కెట్ యార్డును మంగళవారం మార్కెటింగ్ శాఖ డీఈఈ మునీందర్ సందర్శించారు. గోదాం రేకులపై నుంచి పడుతున్న నీటితో ధాన్యం తడవకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా చేయాల్సిన పనులపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డికి సూచించారు.

టౌన్ క్లబ్ కార్యవర్గానికి అభినందన

సిరిసిల్లటౌన్: నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల టౌన్ క్లబ్ కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మంగళవారం అభినందించి సత్కరించారు.

బస్సు రూట్ సర్వే ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల ఆర్టీసీ డిపో నుంచి ఎల్లారెడ్డిపేట,మాచారెడ్డి,కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ వయా సిద్దిపేట మీదుగా యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో పాటు ప్రతి ఆదివారం కొమురవెల్లి మల్లన్న దేవస్థానంకు బస్సులను నడిపించేందుకు అధికారులు మంగళవారం రూట్ సర్వే చేపట్టారు. డిపో ఎస్‌టీఐ సారయ్య,సెఫ్టీ డ్రైవర్ లకావత్ పర్శరాం, కండక్టర్ దేవయ్య పాల్గొన్నారు.

సెస్ ఆఫీస్ రోడ్డు సర్వే

వేములవాడ: వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి పాపన్న చౌక్ వరకు రోడ్డును విస్తరించి, పుట్‌పాత్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ సిబ్బందితో మంగళవారం సర్వే చేయించారు. దీంతో త్వరలోనే ఈ రోడ్డు మరింత సుందరంగా కనిపిస్తుందని అధికారులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రుద్రంగి: మండల కేంద్రానికి చెందిన 9 మందికి రూ.2.74 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా మంగళవారం రుద్రంగి బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం

వేములవాడ: ఓకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం బెల్టు టెస్టులు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మాస్టర్ ఎంఏ మన్నాన్, కౌన్సిలర్ బింగి మహేశ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటేతో ఆత్మరక్షణతోపాటు శారీరక, మానసికంగా బలంగా ఉండేందుకు తోడ్పడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్లకు అంకితం చేయకుండా కరాటే శిక్షణలాంటి వాటికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

పేదల పెన్నిధి జేఎల్‌ఆర్ వెంకన్న

- ట్రస్టు సేవలను కొనసాగిద్దాం
- మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్

ముస్తాబాద్: రెండు దశాబ్దాలుగా ఎంతోమంది పేదలకు అండగా నిలిచిన జేఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ జూకంటి వెంకటేశ్వర్‌రావు సేవలు మరచిపోలేనివని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన జేఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ జూకంటి వెంకటేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అయన కుటుంబ సభ్యులను మంత్రి కేటీఆర్ మంగళవారం పరామర్శించారు. వెంకన్న చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. పేదలకు ఆపద వస్తే నేనున్నానంటూ ఇరవై ఏళ్లుగా సేవలు అందించిన గొప్ప మానవతా వాది వెంకన్న అన్నారు. చివరి శ్వాస వరకు పేదలకు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరితపించిన వెంకన్న లేని లోటు ఈ ప్రాంత పేదలకు తీరని లోటన్నారు. పేదలకు అండగా నిలుద్దామన్న వెంకన్న ఆశయాన్ని కుటుంబీకులు ముందుకు తీసుకెళ్లాలని, అందుకు తన సహకారం ఉంటుందన్నారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచులు విజయ, జ్యోతి, శ్రావణ్‌రావు, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కేటీఆర్

రైతులకు పరిహారం అందించాలని కాంగ్రెస్ ధర్నా



వేములవాడఅర్బన్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



సిరిసిల్లటౌన్: నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

ఇటీవల వడగండ్ల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయల ఎదుట కాంగ్రెస్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, వేములవాడ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, సంగీతం శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, భూత శ్రీనివాస్, జాలగం ప్రవీణ్(టోని), యెల్ల బాల్‌రెడ్డి, హమీద్, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, ప్యాక్స్ వైస్ చైర్మన్ రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

అధైర్య పడొద్దు.. అందరినీ ఆదుకుంటాం

- మానకొండూర్ ఎమ్మెల్యే బాలకిషన్

ఇల్లంతకుంట: రైతులు అధైర్యపడొద్దని, అందరినీ ఆదుకుంటామని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ముస్కాన్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో ధాన్యం తూకం వేసేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జవారిపేట గ్రామంలో ఎల్లమ్మ సిద్దోగంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇల్లంతకుంటలో డ్రైవర్ ఎంపవర్‌మెంట్ పథకం ద్వారా అనంతారం గ్రామానికి చెందిన హదాస్‌కు తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కారును అందజేశారు. ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అనంతరెడ్డి, సర్పంచ్ కరుణ, ఎంపీటీసీ శ్యామలదేవి పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

‘రైతుల కోసం కాంగ్రెస్ పోరాటం’

ఎల్లారెడ్డిపేట: రైతులు అధైర్య పడవద్దని వారి కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తుందని, ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, సాహెబ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, బాబు, రాజేందర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లిలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత నూతనాపురి శ్రీవేణుగోపాలస్వామి, నాగంపేటలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కొత్తపల్లిలో ఈ నెల 5న గరుడ సేవ, 6న రథోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఈనెల 4 వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి అభిషేకాలు, నవబ్రహ్మ కలశస్థాపన, స్థాపిత దేవత పూజ, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, హోమం, 4న స్వామివారి కల్యాణోత్సవం, ఊరేగింపు సేవ నిర్వహించనున్నారు. దీనికి కోసం నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పూజ చేస్తున్న పండితులు